న్యూస్‌రీల్

క్యూలైన్‌లో కుప్పకూలిన భక్తురాలు



క్యూలైన్‌లో పడిపోయిన భక్తురాలు

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలు శనివారం మధ్యాహ్నం క్యూలైన్‌లో కుప్పకూలింది. ఉపవాసం ఉండడం తోపాటు ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో భక్తురాలు క్యూలైన్లోనే పడిపోయింది. భక్తురాలి కుటుంబ సభ్యులు, సహచర భక్తులు కేకలు వేసినా పట్టించుకునే వారు లేరు. దీంతో అరగంటసేపు క్యూలైన్ నిలిచిపోయింది. చివరికి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది స్పందించి 159 నంబర్ తాళం చెవితో అత్యవసర ద్వారం తీసి భక్తురాలిని బయటకు తీశారు. అత్యవసర ద్వారం తెరచుకోకుండా నీళ్ల తొట్టి ఉండటంతో అందులోని నీటిని ఖాళీ చేసి ద్వారం తీశారు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సుమన్‌మోహన్‌రావు

ఇల్లంతకుంట(మానకొండూర్): సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో శనివారం సమీక్షించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామీణులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఏఎన్‌సీ రిజిస్ట్రేషన్‌లు వేగవంతంగా చేయాలని, టీకాల కార్యక్రమం వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీరాములు, మహేశ్, శరణ్య, రమేశ్ ఉన్నారు.

విద్యాధన్ స్కాలర్‌షిప్ సద్వినియోగం చేసుకోండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు సరోజిని దామోదర్ ఫౌండేషన్ అందిస్తున్న 'విద్యాధన్ స్కాలర్‌షిప్'ను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ విద్యాధన్ రాష్ట్ర కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 9 జీపీఏ సాధించి సంవత్సర ఆదాయం రూ.2 లక్షలలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. పదోతరగతి మెమో, ఆదాయ ధ్రువీకరణపత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో www.vidyada.org వెబ్‌సైటులో ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్క్రీనింగ్ టెస్టులో మెరిట్ ఆధారంగా ప్రతీ ఏడాది రూ.10 వేల నుంచి రూ.60 వేల వరకు స్కాలర్‌షిప్ అందిస్తారని తెలిపారు. వివరాలకు 6300891827లో సంప్రదించాలని సూచించారు.

ముందస్తు సాగు చేసుకోవాలి



రైతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

వేములవాడరూరల్: రైతులు వచ్చే పంట నుంచి ముందస్తు సాగుచేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సూచించారు. వేములవాడ మండలం మర్రిపల్లి రైతువేదికలో శనివారం నిర్వహించిన వ్యవసాయ దినోత్సవంలో మాట్లాడారు. జూన్ మొదటి వారంలోనే రైతులు వరిపంట సాగుచేసుకుంటే అకాల వర్షాలతో నష్టపోకుండా ఉండవచ్చన్నారు. వెదజల్లే పద్ధతిలో పంటను సాగుచేస్తున్న చెక్కపల్లి రైతు ఎర్రం మల్లారెడ్డి, వెంకట్రావుపల్లికి చెందిన వుట్కూరి చంద్రారెడ్డి, చెక్కపల్లికి చెందిన అడ్డిక జైపాల్‌రెడ్డిలను సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ ఏశ వాణి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వెలుమ బాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిరుపతి, టంపుల సుమన్, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, ఎంపీడీవో రాంరెడ్డి, సర్పంచులు జైపాల్‌రెడ్డి, సుద్దాల లచ్చయ్య, ఏవో సాయికిరణ్, టీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గోస్కుల రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సుద్దాల బాలయ్య పాల్గొన్నారు.



దుబాయిలోని ఆఫీస్‌లో రాధారపు సత్యం

సండే స్పెషల్



వాళ్లంతా సామాన్యులు. మధ్యతరగతి కష్టాలను అనుభవించిన వారు. ఆ కష్టాల కడలిని దాటేందుకు ఉపాధి కోసం గల్ఫ్‌బాట పట్టారు. కూలీగా మొదలైన వారి ప్రస్థానంలో ఎన్నో ఒడిదొడుకులు ఉన్నాయి. గది అద్దె చెల్లించలేక ఒకరు డేరాలో నిద్రపోతే.. డబ్బులు సరిపోక ఇంకొకరు కార్లు కడిగారు.. కడుపు మాడ్చుకున్న రోజులూ ఉన్నాయి. అన్నింటిని అధిగమించిన వారిలో అంకితభావం.. ఎదగాలన్న కసి ఉన్నత స్థానాల్లో నిలబెట్టింది. కొందరు కంపెనీలు పెట్టి యజమానులుగా మారితే.. మరికొందరు అదే కంపెనీలో ఉన్నత స్థానాలకు చేరారు. వారి ఎదుగుదలలో ఇతరులకు ఉపాధి చూపిస్తున్నారు. వందలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తూ.. ఉపాధి చూపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సామాన్యుల సక్సెస్ స్టోరీ ఈవారం సండే స్పెషల్..

అసామాన్యులు

- కష్టాల కడలిని దాటిన యువకులు
- ఉపాధి కోసం గల్ఫ్‌బాట
- అంకితభావంతో ఉన్నత స్థానాలకు..
- ఇతరులకు ఉపాధి చూపుతున్న వైనం
- ఆదర్శంగా నిలుస్తున్న ఎన్‌ఆర్‌ఐలు

చదువులో ఫెయిల్.. జీవితంలో పాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): చదువు అబ్బిరాలేదు.. ఆర్థిక పరిస్థితి కలిసి రాలేదు. పదోతరగతి వరకే చదవడమే గగనంగా సాగింది. కష్టాల కడలిని దాటేందుకు చిన్నతనంలోనే స్వగ్రామాన్ని వదిలి ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్‌బాట పట్టాడు. తొలి రోజుల్లో కూలీగా పనిచేసిన రాధారపు సత్యం అంచెలంచెలుగా ఎదిగి నేడు ఒక కంపెనీ యజమానిగా 780 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు.

2002లో కూలీగా వెళ్లి..

ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండలంలోని అడవిపదిరకు చెందిన రాధారపు సత్యం పదోతరగతిలో ఒక్క మార్కుతో ఫెయిలై ఉపాధి కోసం 2002లో దుబాయికి వెళ్లాడు. అక్కడ తొలి ఏడాది సెంట్రింగ్ కూలీగా పనిలో చేరాడు. డేరాల మధ్య నివాసం ఉంటూ కష్టంగా కాలం వెళ్లదీశాడు. ఏడాది అనంతరం ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరాడు. అదే కంపెనీలో మార్కెటింగ్ సేల్స్‌మెన్‌గా, ఆపరేషన్ మేనేజర్‌గా పనిచేశాడు. ఆర్థిక పరిస్థితుల్లో మార్పు రాకపోవడం.. విధుల్లో బాధ్యతలు పెరగడంతో సత్యం ఆలోచనల్లో పడ్డాడు. ఉద్యోగ బాధ్యతలతో అలసిపోయిన ఆయనకు ఓ వినూత్న ఆలోచన వచ్చి.. తానే సొంతంగా కంపెనీ పెట్టి పది మందికి ఉపాధి కల్పించాలనే నిర్ణయానికి వచ్చాడు. 2015లో సొంతంగా ఎల్ఎస్‌పీఎంకే అనే పేరుతో కంపెనీని ప్రారంభించాడు. ఇక్కడ ఉపాధి లేక బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి వీసాలను పంపించి తన కంపెనీలో ఉపాధి కల్పించాడు. ప్రస్తుతం సత్యం కంపెనీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన 780 మంది ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా తెలంగాణ దుబాయి ఎమిరేట్స్(ఈటీసీఏ) అధ్యక్షుడిగా ఏడాదిగా పనిచేస్తున్నాడు.

కష్టపడితే ఫలితం ఉంటుంది

> జీవితంలో కుంగిపోకుండా ఒక లక్ష్యంతో కష్టపడితే ఉన్నత స్థానాలకు చేరుకుంటారు. ఇందుకు నేనే ఉదాహరణ. చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందులతో బతకడం కష్టమని భావించి.. ఉపాధిని వెతుక్కుంటూ ఎడారి దేశానికి వెళ్లి అక్కడ కూడా దుర్భర జీవితాన్ని గడిపి ఈ స్థాయికి చేరాను. ప్రతి ఒక్కరు కష్టమే ఫలితంగా భావించి ముందుకు సాగాలి.
> – రాధారపు సత్యం, ఈటీసీఏ అధ్యక్షుడు



దుబాయిలోని ఆఫీసులో గోపాల్‌రావు

నాడు కూలీ.. నేడు యజమాని

కోనరావుపేట(వేములవాడ): ఉపాధి కోసం దుబాయికి వెళ్లిన వ్యక్తి ఏకంగా ఓ కంపెనీకి యజమాని స్థాయికి ఎదిగాడు. తాను ఎదగడంతోపాటు మరో 130 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నాడు కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బొమ్మెన గోపాల్‌రావు.

2016లో దుబాయి బాట

బొమ్మెన గోపాల్‌రావు గతంలో గ్రామ ఎంపీటీసీగా పనిచేశారు. తర్వాత 2016లో దుబాయిలోని ఓ కంపెనీలో పనిచేసేందుకు వెళ్లాడు. రెండేళ్లు కంపెనీలో పనిచేసిన గోపాల్‌రావు అక్కడి పరిస్థితులను అవగతం చేసుకుని 2018లో క్రియేటివ్ వ్యూ టెక్నికల్ వర్క్స్(ఎల్‌ఎల్‌సీ) అనే కంపెనీని ప్రారంభించాడు. అక్కడి పనులకు, వివిధ కంపెనీలకు కూలీలను చేరవేస్తుంటాడు. అలా ఇప్పటి వరకు ఇండియాలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది యువకులను దుబాయికి తీసుకెళ్లి ఉపాధి చూపుతున్నాడు.



దుబాయి షేక్‌తో వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్

కష్టపడి.. పైకొచ్చారు

వేములవాడ: మూడు దశాబ్దాల క్రితం గల్ఫ్‌బాట పట్టిన యువకుడు.. నేడు ఓ వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించాడు. ఉపాధి వెతుక్కుంటూ వెళ్లిన వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్ నేడు వందలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. 1989లో దుబాయికి ఉపాధి కోసం వెళ్లాడు వేములవాడకు చెందిన తోట రామ్‌కుమార్. తొలి రోజుల్లో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం ఎస్సారార్(శ్రీరాజరాజేశ్వర) పేరుతో బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేసే వ్యాపారం చేస్తున్నారు. దాదాపు 250 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

సొంతూరికి సేవ

ఉపాధి వెతుక్కుంటూ దుబాయి వెళ్లిన తోట రామ్ కుమార్ 30 ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. భార్య స్వప్న, కుమారులు రాహుల్, రోహన్, కూతురు రోష్నిలతో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. పండుగలు, ప్రత్యేక కార్యక్రమాల సమయంలో వేములవాడకు వస్తుంటారు.

బాధితులకు అండగా..

దుబాయిలో ఇబ్బందులు పడుతున్న మన ప్రాంతం వారికి అండగా నిలుస్తున్నారు. తనకు ఉన్న పరిచయాలతో వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు. గల్ఫ్ బాధితులకు అండగా నిలుస్తున్నారు.

లేబర్ టు మేనేజర్‌గా..

- అంచెలంచెలుగా ఎదిగిన నారాయణపూర్ వాసి
- మస్కట్‌లో పలువురికి ఉపాధి కల్పిస్తున్న యువకుడు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతుకుటుంబంలో పుట్టిన ఓ సామాన్య యువకుడు ఉపాధిని వెతుక్కుంటూ గల్ఫ్ దేశాలకు వెళ్లి.. నేడు మేనేజర్ స్థాయికి చేరాడు. ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ ఆ కుటుంబాలకు బాసటగా నిలుస్తున్నాడు. కుగ్రామంలో పుట్టిన ఆ యువకుడు డిగ్రీ వరకు చదివి.. 2006లో స్వగ్రామంలో ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్‌బాట పట్టాడు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన కొండేటి దేవేందర్ ఒమన్ దేశంలో తొలుత పార్ట్‌టైం ఉద్యోగంలో చేరాడు. వేతనం తక్కువగా ఉండడంతో కార్లు సైతం కడుగుతూ కాలం వెల్లదీశాడు. మురియా టూరిజం డెవలప్‌మెంట్ కంపెనీలో ఆఫీస్‌బాయ్‌గా చేరాడు. దేవేందర్ అంకితభావంతో పనిచేస్తున్న విధానాన్ని గుర్తించిన యాజమాన్యం అడ్మిన్ అసిస్టెంట్‌గా అవకాశం ఇచ్చింది. క్రమంగా రెంటల్ మేనేజర్ స్థాయికి ఎదిగాడు. తన ఎదుగుదలతోపాటు సిరిసిల్ల జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన అనేక మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాడు. అక్కడికి వెళ్లిన వారికి మంచి ఉద్యోగాలను దగ్గర ఉండి వెతికి పెట్టాడు. దేవేందర్ సహకారంతో సుమారు యాభైకి పైగా ఒమన్ దేశంలో ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతా ఇండియాలో సాఫ్ట్‌వేర్ల కంటే ఎక్కువ వేతనాలు పొందుతూ సంతోషంగా ఉన్నారు.



ఆఫీసులో దేవేందర్

అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి

> ఉద్యోగాలు లేవని.. నిరాశ పడకుండా మంచి నైపుణ్యంతో ఒమన్ లాంటి దేశాలకు వస్తే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. నైపుణ్యం ఉన్న వారికి గౌరవప్రదమైన ఉద్యోగమే కాకుండా మంచి వేతనాలు ఉంటాయి. గల్ఫ్ దేశాల్లో ఎక్కువగా టూరిజం, హోటల్ రంగాల్లో ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ఆత్మస్థైర్యంతో ఉండి, ఈ దేశానికి వస్తే ఏదైనా సాధించే అవకాశం ఉంది.
> – కొండేటి దేవేందర్, ఎన్‌ఆర్‌ఐ, ఒమన్

అభాగ్యులకు పోలీసుల ఆసరా



అనాథ వృద్ధులతో ఎస్పీ అఖిల్‌మహాజన్, జిల్లా పోలీస్ అధికారులు

- హెయిర్‌కట్ చేయించి నూతన దుస్తులు ఇప్పించి
- అనాథ వృద్ధులను ఆశ్రమంలో చేర్పించిన అధికారులు

సిరిసిల్లక్రైం: జిల్లాలోని నిరాశ్రయులకు, అభాగ్యులకు పోలీసులు అండగా నిలిచారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శనివారం జిల్లాలోని అన్ని ఠాణాల పరిధిలోని నిరాశ్రయులైన వృద్ధులను గుర్తించి, వారందరికీ హెయిర్‌కట్ చేయించి నూతన వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ వేదికగా నిలిచింది. ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు సామాజిక బాధ్యతగా భాగస్వాములయ్యారు. అనంతరం వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు జిల్లా సంక్షేమాధికారితో ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడారు. పది మంది నిరాశ్రయులకు నూతన దుస్తులు అందజేసి, అండగా ఉంటామని భరోసా నిచ్చారు. 40 మంది నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు, పండ్లు, దుస్తులు అందజేశారు. ఎస్పీ అఖిల్‌మహాజన్ మాట్లాడుతూ స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి, రవికుమార్, సీఐలు అనిల్‌కుమార్, కరుణాకర్, ఆర్ఐ రజనీకాంత్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రైతు పక్షపాతి

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కొనియాడారు. మండలంలోని రాజేశ్వర్‌రావునగర్ రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతుదినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. రైతుల కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కాళేశ్వరం జలాలతో భూములను సస్యశ్యామలం చేశారని పేర్కొన్నారు. జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఎంపీపీ వంగ కరుణ, సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, పావని పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు

అన్నదాతలకు అండగా ప్రభుత్వం

- జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ
- ఎడ్లబండ్ల ర్యాలీలు

కోనరావుపేట(వేములవాడ): అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మండలంలోని కొలనూర్‌లో సింగిల్‌విండో, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దినోత్సవంలో పాల్గొని ఎడ్లబండిని తోలారు. రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులకు అవసరమైన సలహాలు, శిక్షణ ఇచ్చేందుకు రైతువేదికలు నిర్మించినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్, ఏవో వెంకట్రామమ్మ, సర్పంచులు యమున, వంశీకృష్ణారావు, అరుణ, సింగిల్‌విండో చైర్మన్ సంకినేని రామ్మోహన్‌రావు, నాయకులు నిరంజన్‌రావు, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.



ఎడ్లబండిపై వస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ

వ్యవసాయరంగంలో సమూల మార్పులు – కలెక్టర్ అనురాగ్ జయంతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రం ఏర్పడిన తర్వాత వ్యవసాయరంగంలో సాధించిన స్ఫూర్తితో మనం దరం సమిష్టిగా రానున్న రోజుల్లో మరిన్ని గొప్ప విజయాలు సాధిద్దామని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. రాచర్లగొల్లపల్లి క్లస్టర్ రైతువేదికలో శనివారం నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ దేశానికి అన్నపూర్ణ..పంటలను నెల ముందస్తుగా సాగు చేద్దాం అనే ప్రచార పోస్టర్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. యాసంగిలో ముందస్తు వరినాట్లు వేయాలని సూచించారు. ప్రస్తుతం రెండు సీజన్లలో పంటను ఒక నెల ముందుకు జరిపితే రైతులకు అన్ని విధాలుగా లాభం కలుగుతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. ఎంపీపీ పిల్లి రేణుక, సర్పంచ్ పాశం సరోజన, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఏవో భూంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

వేములవాడఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, వసతులపై బడిబాటలో విస్తృత ప్రచారం చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి శైలజ కోరారు. వేములవాడలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో న్యూఅర్బన్‌కాలనీలో శనివారం నిర్వహించిన బడిబాటకు హాజరై మాట్లాడారు. హైస్కూల్‌లో కొనసాగుతున్న మన బడి–మన బస్తీ పనులను పరిశీలించారు. హెచ్ఎంలు సుహాసిని, ఉమా, టీచర్లు చక్రపాణి, మాధవి పాల్గొన్నారు.



హాజరైన జిల్లా సెక్టోరల్ అధికారి శైలజ

రోడ్డెక్కిన అన్నదాతలు

చందుర్తి(వేములవాడ): ధాన్యం కొనుగోలులో జాప్యంపై రైతులు మండిపడ్డారు. నెల రోజులుగా కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం మండలంలోని మల్యాల, మర్రిగడ్డ గ్రామాల రైతులు వేములవాడ– కోరుట్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గంటకు పైగా రైతులు రాస్తారోకోను చేపట్టడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. చందుర్తి ఎస్సై రమేశ్ మల్యాలకు చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. లారీల కొరత తీర్చుతామంటూ పోలీసులు ఇచ్చిన హామీతో నిరసన విరమించారు. ఈసరి శ్రీనివాస్, శంకర్, మధు, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, దారం హన్మంతురెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మర్రిగడ్డలో రాస్తారోకో చేస్తున్న రైతులు

కబ్జా నుంచి చెరువును కాపాడండి



కలెక్టర్ చాంబర్ ఎదుట బైఠాయించిన రైతులు

సిరిసిల్లటౌన్: కబ్జాకోరుల నుంచి చెరువును కాపాడాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ రైతులు శనివారం కలెక్టర్ చాంబర్ ఎదుట బైఠాయించారు. వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని చెరువు స్థలం దాదాపు 60 ఎకరాలను అధికార పార్టీకి చెందిన ప్రముఖుడు కబ్జా చేశారని ఆరోపించారు. చెరువు దురాక్రమణతో భూగర్భ జలాలు అడుగంటి పంటభూములు ఎందుకు పనికి రాకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి మద్దతు తెలిపారు. ఈ సమస్యను కలెక్టర్ పరిష్కరించాలని కోరారు.

క్లుప్తంగా

తెలంగాణ పథకాలపై వ్యాసరచన పోటీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి మోహన్ ఆదేశాలతో తెలంగాణ పథకాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తెలంగాణకు హరితహారం, రైతుబంధు తదితర అంశాలపై వ్యాసాలు రాశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అధ్యాపకులు సత్యనారాయణ, పర్శరాములు, చంద్రమౌళి, భూమక్క, కవిత, విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

పోరాటయోధులను ప్రభుత్వం విస్మరించింది

వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అన్ని వర్గాలవారు పోరాటం చేశారని, కానీ పోరాట యోధులను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమ సమయంలో జేఏసీ కన్వీనర్‌గా విధులు నిర్వహించిన ప్రముఖ న్యాయవాది నేరెళ్ల తిరుమల్‌గౌడ్, వివిధ రూపాల్లో తెలంగాణ కోసం ప్రత్యేక నిరసనలు తెలిపిన కొమురయ్యగౌడ్‌లను శనివారం సత్కరించారు. త్యాగాలు, బలిదానాలతో వచ్చిన తెలంగాణలో ఒకే కుటుంబం రాజ్యమేలుతుందన్నారు. ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

వర్షాలు కురవాలని ముడుపు విప్పిన రైతులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని రావిచెట్టు హన్మాన్ ఆలయంలో శనివారం వేదపండితులు హనుమండ్లశర్మతో కలిసి రైతులు ఈ యేడు వర్షాలు కురవాలని కోరుతూ గతంలో కట్టిన ముడుపు విప్పారు. రెండు నెలల క్రితం అకాల వర్షాలు పడొద్దని స్వామివారిని కోరుతూ వరికోతలకు ముందు రైతులు ముడుపు కట్టారు. సాంప్రదాయ బద్ధంగా వస్తున్న ఆచారాన్ని రైతులు పాటిస్తున్నారు. అకాల వర్షాలు పడవద్దని ముడుపు కడితే వర్షాలు పడవని, ముడుపు విప్పితే సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయనేది రైతుల నమ్మకం. ప్రత్యేక పూజలు చేసి ముడుపు విప్పారు. రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, రైతులు రావుల ఎల్లారెడ్డి, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, సతీశ్‌కుమార్, అంజిరెడ్డి, చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టపగలు రూ.5 లక్షలు చోరీ

వేములవాడఅర్బన్: మండలంలోని చీర్లవంచ గ్రామంలో పట్టపగలు కారులోంచి రూ.5 లక్షలు చోరీకి గురయ్యాయి. బాధితుడు, పోలీసుల వివరాలు.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన శ్రీనివాస్ వేములవాడలోని ఓ బ్యాంక్‌లో రూ.5 లక్షలు తీసుకుని కారు వెనుక సీటు బ్యాగ్‌లో పెట్టాడు. చీర్లవంచలోని బంధువులు ఇనుకోండ నర్సయ్య ఇంటికి వెళ్లాడు. ఇంటి ముందు కారు ఆపి లోనికి వెళ్లి మాట్లాడుతుండగా ద్విచక్ర వాహనం మీద వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు కారు డోర్ అద్దం పగలగొట్టి రూ.5లక్షలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు పూర్తి చేయండి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలోని మానేరు, మూలవాగులపై నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌లను వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షించారు. మానేరు వాగుపై 11 చోట్ల, మూలవాగుపై 13 ప్రదేశాల్లో చెక్‌డ్యామ్‌లను రూ.155కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఏడు చెక్‌డ్యామ్‌లు పూర్తయ్యాయని, 13 చెక్‌డ్యామ్‌ల పనులు 90 శాతం మేరకు జరిగాయని, మరో నాలుగింటి పనులు వివిధ దశల్లో ఉన్నాయని అధికారులు వివరించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి వర్షాలు మొదలయ్యేలోగా చెక్‌డ్యామ్‌ల పనులు పూర్తి చేయాలన్నారు. ఇవి పూర్తయితే నర్మాల నుంచి మధ్యమానేరు వరకు మానేరువాగు నిండా నీటితో జలకళ ఉట్టిపడుతుందన్నారు. నీటిపారుదలశాఖ ఈఈ అమరేందర్‌రెడ్డి, 9వ ప్యాకేజీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఇంజినీర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో దశాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా అధికారులు

పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నీటిపారుదలశాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి ఆవిష్కరించారు. జూన్ 7న నిర్వహించే నీటిపారుదల దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. డీపీవో రవీందర్, డీపీఆర్వో ఎం.దశరథం, నీటిపారుదలశాఖ ఈఈలు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో రమేశ్‌కుమార్ అన్నారు. శనివారం సిరిసిల్లలోని కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో చేపట్టిన బడిబాట ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు బడిబాట ప్రచార రథన్ని జెడా ఊపి ప్రారంభించారు. శివనగర్, బీవై నగర్, తారకరామ నగర్, గణేష్‌నగర్‌లో బడిబాట కొనసాగించారు. ఎంఈవో దూస రఘుపతి, సెక్టోరియల్ అధికారి సిరిసిల్ల విద్యాసాగర్, కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, ఎస్ఎంసీ చైర్మన్ మాదాసు దేవయ్య, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రమేశ్

కోనరావుపేటలో..

కోనరావుపేట(వేములవాడ): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు ఆలోచించి తమ చిన్నారులను చేర్పించాలని డీఈవో రమేశ్ అన్నారు. కోనరావుపేటలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లోని విద్యార్థులు వంద శాతం ప్రభుత్వ స్కూళ్లలోనే చేరాలన్నారు. ఎంఈవో రఘుపతి, సర్పంచ్ పోకల రేఖ, సెస్‌వైస్ చైర్మన్ తిరుపతి, హెచ్‌ఎం సీతారాంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ఇళ్ల పైకప్పులు ధ్వంసం

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో పాటు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. భారీ స్థాయిలో ఈదురుగాలులు వీయడంతో పాలకేంద్రం రేకులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గ్రామంలోని పలు ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం

మండలంలోని సోమారంపేట, గొల్లపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో రేకుల షెడ్లకు నష్టం జరగడం, రోడ్లపై చెట్ల కొమ్మలు విరిగిపడిన ప్రాంతాలను ఎంపీపీ వెంకటరమణారెడ్డి పరిశీలించారు. నష్టం అంచనా వేయించి సాయమందిస్తామని, అధైర్యపడొద్దు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంద సుశీల, పీఏసీఎస్ డైరెక్టర్ నవీన్‌రెడ్డి, అనగోని యాదగిరిగౌడ్, కడగండ్ల తిరుపతి ఉన్నారు.

ఎన్‌ఆర్‌ఐ పాలసీ అమలు చేయాలి

- వలస కార్మికుల డిమాండ్
- మస్కట్‌లో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

సిరిసిల్ల: గల్ఫ్ దేశాల్లోని వలస కార్మికుల సంక్షేమానికి ఎన్‌ఆర్‌ఐ పాలసీని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించాలని మస్కట్‌లోని వలసకార్మికులు కోరారు. ఒమన్‌లోని మస్కట్‌లో శుక్రవారం రాత్రి తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు మైపాల్‌రెడ్డి, కృష్ణ, నర్సయ్య, అలీ కబీర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇంటింటికీ మంచినీరు, 24 గంటల విద్యుత్, సాగునీరు వచ్చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు రైతుబంధు, రైతుబీమా ఇస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గల్ఫ్ దేశాల్లోని కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఐ పాలసీని ప్రకటించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. తెలంగాణ వలస కార్మికుల సంఘం నాయకులు గాలిగాని రాజు, మేడిపట్ల లక్ష్మణ్, గాంధారి నరేశ్, గంగాధర్, భూమేశ్, నీరటి అశోక్, దుబ్బాక వేణు, మహిళా నాయకులు బోనగిరి అంజలిరెడ్డి, వరలక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో తెలంగాణ వాసులు

‘రైతులు కష్టాల్లో ఉంటే సంబరాలు చేస్తారా’

సిరిసిల్లటౌన్: హవ్వ.. నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు.. అన్నట్లుగా ఉంది తెలంగాణ సర్కారు తీరు అని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడారు. వడ్లు కొనుగోలు గాక, వర్షాలతో ధాన్యం తడిసి, తెచ్చిన అప్పులు కట్టకుండా కష్టాల్లో రైతులు కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాతలకు ఏమాత్రం ఆదుకోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి దశాబ్ది ఉత్సవాల పేరుతో రైతు దినోత్సవం చేసే అర్హతే లేదన్నారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రైతుల రుణమాఫీ ప్రకటించాలన్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి, రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని డిమాండ్ చేశారు. సర్కారు తీరుపై రైతులు కన్నెర్ర జేశారన్న విషయాన్ని గుర్తెరుగాలని, లేకుంటే గుణపాఠం నేర్పక తప్పదని హెచ్చరించారు.

సిరిసిల్లలో ఏసీఎల్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర లేబర్ కమిషనర్‌కు వినతి

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో కార్మికశాఖ సహాయ కమిషనర్‌ను నియమించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడం రమణ శనివారం రాష్ట్ర లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లాలో పవర్‌లూమ్, బీడీకార్మికులు, భవన నిర్మాణ, హమాలీ, సైజింగ్, రైస్‌మిల్లు, జిన్నింగ్, క్రషర్ కార్మికులు లక్షకు పైగా ఉన్నారని వివరించారు. ప్రస్తుతం సిరిసిల్లలో సహాయ లేబర్ అధికారి మాత్రమే ఉన్నారని, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఏసీఎల్) ఆఫీస్ కోసం జగిత్యాలకు వెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. కార్మికుల తొలగింపు, నష్టపరిహారం కేసులు, కనీస వేతనాల చట్టం అమలు, బోనస్, గ్రాడ్యుటీ, పారిశ్రామిక వివాదాల పరిష్కారం వంటి వాటిపై ఏసీఎల్ ఆఫీస్‌కు జగిత్యాల వరకు వెళ్లాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ ఉన్నతాధికారులు స్పందించి సిరిసిలలో ఏసీఎల్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈమేరకు రాష్ట్ర లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందించినట్లు తెలిపారు.



హైదరాబాద్ లేబర్ కమిషనర్ ఆఫీస్ ముందు సీఐటీయూ నాయకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రుద్రంగి(వేములవాడ): రుద్రంగిలోని గోలెపులొద్ది చెరువులో గురువారం చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటమునిగిన ఎల్ల రాజనర్సయ్య(62) కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టమార్టం నిర్వహించినట్లు రుద్రంగి ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మృతునికి భార్య భాగ్య, ఇద్దరు కొడుకులు భూమయ్య, రాజు, కూతురు సంధ్య ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో పొట్టకూటి కోసం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెందిన నిరుపేద ఎల్ల రాజనర్సయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గంగపుత్ర సంఘం సభ్యులతో పాటు స్థానికులు కోరారు.



రాజనర్సయ్య (ఫైల్)

అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాలి

సిరిసిల్లటౌన్: అర్హులకు కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో మాట్లాడారు. దశాబ్ద కాలంగా రాష్ట్రంలో రేషన్ కార్డుల సమస్య ఎక్కువైందన్నారు. గతంలో కార్డుల్లో కొందరి పేర్లను తొలగించారని వాటిని తిరిగి నమోదు చేయాలన్నారు. కార్డుల్లో పేర్ల నమోదు, తొలగింపు ప్రక్రియను వెంటనే చేపట్టాలని, కొత్త కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ తరఫున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పంతం రవి, మంచికట్ల రమేష్, అజ్జ వేణు, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుంటి వేణు

గుండెపోటుతో యువకుడు..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని కేసీఆర్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న అల్లె మధు(33) శనివారం తెల్లవారుజామున గుండెపోటుకు గురై మృతిచెందాడు. కుప్పకూలిన మధును కాలనీవాసులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మధు దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోయారు. తొమ్మిదేళ్ల క్రితం లావణ్యతో వివాహం జరిగింది. భర్త మృతితో లావణ్య ఒంటరిగా మిగిలింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



మధు (ఫైల్)

సీఎం హామీ నిలబెట్టుకోవాలి

సిరిసిల్లటౌన్: రెండో ఏఎన్ఎంలుగా కొనసాగుతున్న ఆరోగ్య కార్యకర్తలను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కదారి రాములు కోరారు. శనివారం సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన రెండో ఏఎన్ఎంల సేవలకు సర్కారు వెంటనే గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధ్యక్షుడు అజ్జ వేణు, మంచికట్ల రమేష్, సోమ నాగరాజు తదితరులున్నారు.



మాట్లాడుతున్న రాములు

పిడుగుపాటుకు ఎద్దు మృతి

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రేపాక గ్రామంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఎట్ల శ్రీనివాస్ అనే రైతుకు చెందిన ఎద్దుపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ.50 వేల నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని తంగళ్లపల్లి, బద్దెనపల్లి క్లస్టర్ రైతు వేదికలను శనివారం కలెక్టర్ అనురాగ్ జయంతి సందర్శించారు. ఈ సందర్భంగా రైతు దినోత్సవంలో పాల్గొన్న రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సూచన మేరకు ప్రత్యామ్నాయ పంటలవైపు అడుగులు వేయాలని కోరారు. కలెక్టర్ వెంట సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, తహసీల్దార్ పి.సదానందం, అధికారులు ఉన్నారు.

సైబర్ మోసం.. రూ.22వేలు మాయం

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని భూక్య తండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. తక్కువ ధరకే వాహనం ఉందని మోసగించారు. ఈ ఘటన శనివారం జరిగింది. బాధితుడి వివరాలు.. ఓ వెబ్‌సైట్‌లో తక్కువ ధరకే వాహనం వస్తుందని తెలియడంతో సంబంధిత నంబర్‌కు బాధితుడు ఫోన్ చేశాడు. సైబర్ నేరగాళ్లు చెప్పిన మాటలు నమ్మి రూ.22 వేల వరకు పంపించాడు. తీర వాహనం రాక పోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను సంప్రదించాడు.

రాష్ట్రంలో పండుగలా వ్యవసాయం

బోయినపల్లి(చొప్పదండి): సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రైతులకు ఇస్తున్న పెట్టుబడి సాయంతో రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా మారిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొదురుపాక, బోయినపల్లి, విలాసాగర్, కోరెం క్లస్టర్ల రైతువేదికల్లో రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో రైతులు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుసంక్షేమ ప్రభుత్వం నడుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, తహసీల్దార్ దర్శెల్లి నరేశ్, ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ నాగయ్య, సర్పంచు గుంటి లతశ్రీ, కోరెం సింగిల్‌విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్, ఆర్బీస్ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య, కొనుకటి లచ్చిరెడ్డి, ఎంఏఓ ప్రణీత, ఏఈఓలు శ్రీదేవి, రజిత, సాహితి, సంబ లక్ష్మీరాజం, గుంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే రవిశంకర్, తదితరులు

ఘనంగా విగ్రహప్రతిష్ఠ వేడుకలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లబొప్పాపూర్‌లో విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో శనివారం నల్లపోచమ్మ, మత్తడిపోచమ్మ, సంతాన నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదస్వస్తి, నిత్యవిధి,ఆలయ సంస్కారం, వాస్తువచన హోమం నిర్వహించారు. మహిళలు పోచమ్మ బోనాలతో పుర వీధుల్లో ఆలయాల వద్దకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సెస్‌డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు అందె సుభాష్, బండారి బాల్‌రెడ్డి, సీత్యానాయక్ అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కంబోజా దేవరాజు, రవీందర్‌చారి, సభ్యులు ఆంజనేయులుచారి, సతీశ్‌చారి, రవిచారి, ప్రశాంత్‌చారి, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.



మొక్కులు చెల్లించుకుంటున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

- మస్కట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి

రుద్రంగి(వేములవాడ): ఇటీవల మస్కట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నిరుపేద కుర్మ మల్లేశం కుటుంబానికి దుబాయిలో ఉంటున్న రుద్రంగి ప్రవాస భారతీయులు చేయూతనందించారు. ఉపాధి కోసం దుబాయి వెళ్లిన వారు మల్లేశం కుటుంబ పరిస్థితిని తెలుసుకొని రూ.84వేలు విరాళం సేకరించారు. శనివారం రుద్రంగిలోని మల్లేశం నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. మల్లేశం తల్లితోపాటు ముగ్గురు కూతుళ్ల పెళ్లిళ్ల బాధ్యత మోయలేని భారంగా మారింది. దాతలు స్పందించి ఆర్థిక సహాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రవాస భారతీయులు బొల్లి దేవేందర్, ధర్నారెడ్డి, గంగమల్లయ్య, శీలం మల్లేశం, బైరి గంగారాం, మొగుళ్ల శ్రీహరి, ఇట్టవేని రాజం ఉన్నారు.



మల్లేశం కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న రుద్రంగి ప్రవాస భారతీయులు

ధాన్యం కొనుగోళ్లలో సర్కార్ నిర్లక్ష్యం

ఇల్లంతకుంట(మానకొండూర్): వరికోతలు ప్రారంభమై రెండు నెలలు పూర్తి కావస్తున్నా ధాన్యం కొనుగోళ్లు సకాలంలో చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని, తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరుతో సీఎం కేసీఆర్ రూ.వందల కోట్లు వృథా ఖర్చు చేస్తున్నారని కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఉదయం మండలంలోని రేపాక గ్రామంలో పల్లె పల్లెకు కవ్వంపల్లి.. గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొలకలు వస్తున్నా తూకం వేయడం లేదని, లారీల సమస్యతోపాటు క్వింటాలుకు ఐదారు కిలోలు కోత పెడుతూ రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పబోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, సాగర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కవ్వంపల్లి

జపాన్ ఇన్‌స్పైర్ మనక్‌కు మనోళ్లు



శ్రీహితరెడ్డి



అభిషేక్



శ్రీజ



పూజశ్రీ

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఆరు ప్రదర్శనలు ఎంపిక

సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇన్‌స్పైర్ మనక్ అవార్డు ప్రదర్శనలో భాగంగా 2017–18, 2018–19, 2019–20, 2020–21 విద్యాసంవత్సరాలకు గానూ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలో అద్వితీయ ప్రదర్శన కనబరిచిన విద్యార్థుల ప్రాజెక్టులను జపాన్‌లోని సకూరా సైన్స్ హైస్కూల్‌లో జరిగే ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శనకు ఎస్‌సీఈఆర్‌టీ ఎంపిక చేశారు. తెలంగాణ నుంచి 18 ప్రదర్శనలు ఎంపిక కాగా.. ఉమ్మడి జిల్లానుంచి ఆరు ప్రదర్శనలు ఎంపిక కావడం విశేషం. పెద్దపల్లి జిల్లా నుంచి మూడు, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి ఒక్కో ప్రదర్శన ఎంపికైంది. కాగా 2017–18, 2018–19 సంవత్సరాలకు గానూ 7వ జాతీయ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన ఢిల్లీలో 2019 ఫిబ్రవరిలో జరిగింది. 2019–20 సంవత్సరానికి గాను 8వ జాతీయ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన కరోనా వైరస్ నేపథ్యంలో ఆన్‌లైన్ వేదికగా 2021 సెప్టెంబర్‌లో జరిగింది. 2020–21 ఏడాదికిగానూ 9వ జాతీయ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల ప్రదర్శన ఢిల్లీలో 2022సెప్టెంబర్‌లో జరిగింది. ఈ నాలుగేళ్లలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థుల ప్రదర్శనలను జపాన్ ఇన్‌స్పైర్ మానక్‌లో ప్రదర్శించనున్నారు. కాగా కె.శ్రీజ, ఎం.పూజశ్రీ, డి.హర్షిత (పెద్దపల్లి), వి.శ్రీహితరెడ్డి (కరీంనగర్), ఎండీ.జాకీఅహ్మద్ (జగిత్యాల), ఎం.అభిషేక్ (రాజన్న సిరిసిల్ల)లు ఎంపికయ్యారు. జపాన్‌లోని సకూరాలో నవంబర్ 5 నుంచి 11 వరకు పోటీల ప్రదర్శన జరగనుంది.



హర్షిత

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ నర్సయ్య

సిరిసిల్లఅర్బన్: రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సిరిసిల్ల మున్సిపల్ పరిధి బోనాల, చంద్రంపేటలోని రైతు వేదికల్లో శనివారం రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి నర్సయ్య, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ హాజరయ్యారు. ముందుగా చంద్రంపేటలో రైతులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ కృషితో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్, తదితర పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కౌన్సిలర్లు పోచవేణి సత్య, పాతూరి రాజిరెడ్డి, కల్లూరి లత, బోల్గం నాగరాజు, లింగంపల్లి సత్యనారాయణ, కల్లూరి రాజు, నాయకులు, వ్యవసాయ అధికారులు అనూష, సుచరిత, సాయివైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గడ్డం నర్సయ్య

క్లుప్తంగా

పే స్కేల్ వర్తింపజేయాలని ఎంపీపీకి వినతి



వినతి పత్రం ఇస్తున్న ఉపాధిహామీ ఉద్యోగులు

ముస్తాబాద్: ఉపాధిహామీ పథకంలో పదిహేను ఏళ్లగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఉపాధిహామీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఎంపీపీ జనగామ శరత్‌రావుకు ఉపాధిహామీ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు శనివారం వినతిపత్రం అందజేశారు. రమేశ్ మాట్లాడుతూ సెర్ప్, ఐకేపీ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ పే స్కేల్ వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేశారని, ఉపాధిహామీ ఉద్యోగులకు కూడా పేస్కేల్ వర్తింపజేయాలన్నారు. మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కో రారు. ఉపాధిహామీ ఉద్యోగ సంఘం బాధ్యులు నాగరాజు, ఆనంద్‌మోహన్, రాజమల్లయ్య, లక్ష్మణ్, భాను, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామానికి చెందిన దాసరి పర్శరాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబానికి శనివారం జిల్లెల్ల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థికసాయంతోపాటు 50 కిలోల బియ్యం అందజేశారు. సర్పంచ్ కొయ్యడ రమేశ్, నాయకులు ఆంజనేయులు, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎరుకల రమేశ్, కోల శ్రీనివాస్, బొడ్డు బాలయ్య, మోహన్ రెడ్డి, కోల బాలమల్లు, దాసరి లింగం, తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల అపహరణపై ఫిర్యాదు

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో మూడు పశువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బడే స్వామిదాస్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నుంచి కోడెలను తెచ్చుకొని పోషిస్తున్నాడు. పొలం వద్ద కట్టేసిన ఓ ఎద్దు, కోడె, లేగదూడను శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. సాయంత్రం వరకు వెతికినా దొరకకపోవడంతో స్వామిదాస్ కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలి

వేములవాడ: కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి శనివారం వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట– మల్లారెడ్డిపేట గ్రామాల మధ్య మానేరు వాగులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. వాగుపై నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి సమీపంలో ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతిచెందినట్లు గుర్తించారు. ఒడ్డుపైన బ్లూ కలర్ లుంగీ, పింక్ కలర్ చొక్కా, చెప్పులు లభ్యమయ్యాయని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

ముంపు రైతులను ఆదుకోవాలి



చెరువు వద్ద రైతుల ఆందోళన

ముస్తాబాద్(సిరిసిల్ల): ముంపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని శనివారం బాధితులు ఆందోళన చేపట్టారు. మండలంలోని చీకోడు చింతల్‌చెరువు వద్ద భూములు కోల్పోయిన రైతులు నిరసన తెలిపారు. మూడేళ్లుగా చింతల్ చెరువులోకి మల్లన్నసాగర్ నీరు వస్తున్నాయని, చెరువు నిండడంతో.. పట్టా భూములు కూడా మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. మంత్రి కేటీఆర్ తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. చింతల్‌చెరువులో భూములు కోల్పోయిన తమకు భూమి బదులు భూమి ఇచ్చి ఆదుకోవాలన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

- ఎంపీపీ జనగామ శరత్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు
- ఊరూరా రైతు దినోత్సవం

ముస్తాబాద్: అన్నదాతలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ జనగామ శరత్‌రావు, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్, చీకోడు, బందనకల్, నామాపూర్, మద్దికుంట గ్రామాల్లో రైతులు, బీఆర్ఎస్ నాయకులు ర్యాలీలు నిర్వహించారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచులు సుమతి, విజయ, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలవ్యాప్తంగా అన్ని వ్యవసాయ క్లస్టర్లలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తాడూర్ వ్యవసాయ క్లస్టర్లో జరిగిన రైతు దినోత్సవానికి రైతులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎంపీపీ పడిగెల మానస మాట్లాడుతూ.. రైతులకు రాష్ట్రం ఏర్పాటు తర్వాత అభివృద్ధి ఫలాలను గురించి వివరించారు. సర్పంచులు సరిత, కూతురి పద్మ, నక్క రేవతి, ఎంపీటీసీ దుర్గాప్రసాద్, డైరెక్టర్ భాస్కర్ ఇన్‌చార్జి ఎంపీవో విజేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి నరేశ్, కార్యదర్శి కృష్ణయ్య, జూనియర్ కార్యదర్శులు, తదితరులుపాల్గొన్నారు.

ఇల్లంతకుంట: రైతు సంక్షేమమే తెలంగాణ సర్కారు లక్ష్యమని జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని పాత్తూరు, ఇల్లంతకుంటలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రైతు దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. రేపాక, దాచారం, వల్లంపట్ల, గాలిపల్లి, పెద్ద లింగాపూర్ క్లస్టర్ల పరిధిలో రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని మారుపాక రైతు వేదికలో రైతు దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు రైతులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ వజ్రమ్మ, జడ్పీటీసీ రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, వైస్ ఎంపీపీ రవి చందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్లు సల్మాన్‌రెడ్డి, కృష్ణదేవరావు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: వేములవాడ మండల పోలీసులు నిరుపేదలకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ పోలీస్ సురక్ష దినోత్సవం సందర్భంగా మండలంలో మహిళా భద్రత, షీటీం, పోలీస్‌స్టేషన్ల గురించి తెలుసుకునేందుకు పోలీస్ ఎగ్జిబిషన్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. ఏఎస్‌ఐ లక్‌పతి, కానిస్టేబల్ రాజశేఖర్ ఉన్నారు.

వీర్నపల్లి : గర్జనపల్లితోపాటు, వీర్నపల్లి మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి రైతు వేదిక వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో కలిసి ర్యాలీ తీశారు. రైతు వేదికల వద్ద ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. ఎంపీడీవో నరేశ్ కుమార్, ఎమ్మార్వో తఫాజుల్, డిప్యూటీ ఎంఆర్‌ఓ ప్రవీణ్ కుమార్, ఏఈఓలు శ్రీధర్, ఫజుల్ ఎంపీపీ భూల, జెడ్పీటీసీ కళావతి, రైతు బంధు సమితి అధ్యక్షుడు లక్ష్మీరాజం, సెస్ డైరెక్టర్ మల్లేశం, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్ రైతువేదికల్లో రైతు దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఎడ్లబండ్లతో గ్రామ పురవీధుల గుండా ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీవో చిరంజీవి, ఏవో భూంరెడ్డి, కార్యదర్శి దేవరాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్, మోహినికుంటకు చెందిన 10 మంది చిన్నారులకు రెడీమెడ్ డ్రెస్‌లు, బియ్యాన్ని సీఐ ఉపేందర్, ఎస్సై వెంకటేశ్వర్లు అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయిన దుస్తులు, బియ్యం అందించినట్లు తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన దూలం పర్శరాములు గుండెపోటుతో మృతిచెందగా, ఆయన కుమార్తె రేణుకకు సాయం అందించారు. హెడ్‌కానిస్టేబుళ్లు భూమయ్య, బాలనర్సయ్య, పీసీలు రాజశేఖర్, కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో పేదలకు వస్త్రాలు, బియ్యం అందజేశారు. సీఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని యాచకులు, నిరుపేదలను ఠాణాకు పిలిపించి దుస్తులు, బియ్యం అందజేశారు.

బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని వృద్ధులకు ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎస్సై మామిడి మహేందర్ ఆధ్వర్యంలో దుస్తులు, బియ్యం వితరణగా అందించారు. హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లిలో పోలీసులు పేదలకు దుస్తులు, ఆహార పదార్థాలను అందజేశారు. ఆదివారం పోలీస్ సురక్ష దినోత్సవం జరుగుతుందన్నారు.

రుద్రంగి: మండలంలో రైతు దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల నుంచి ఎడ్ల బండ్లపై ఊరేగింపుగా వెళ్లారు. ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ మీనయ్య, వైస్ ఎంపీపీ చిన్న భూమయ్య, అధికారులు, ఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామ క్లస్టర్ పరిధిలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పాడి పరిశ్రమ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కరీంనగర్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ రూ.1530 కే గోపాల మిత్ర ద్వారా కృత్రిమ గర్భధారణ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఎమ్మార్వో తఫాజుల్, జడ్పీటీసీ కళావతి, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు లక్ష్మీరాజం, నాయకులు తదితరులున్నారు.



వెంకటాపూర్‌లో ఎడ్లబండ్ల ర్యాలీ..



దుస్తులు, బియ్యం అందిస్తున్న సీఐ ఉపేందర్, ఎస్సై వెంకటేశ్వర్లు



రైతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



అనాథకు నూతన దుస్తులు అందించిన పోలీసులు



బోయినపల్లిలో దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్సై

అనాథకు అండగా నిలిచిన పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో నాలుగేళ్లుగా రోడ్ల వెంట తిరుగుతూ జీవనం సాగిస్తున్న ఓ అనాథను పోలీసులు చేరదీశారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన జోగుల మనోహర్ కొంతకాలంగా ఎల్లారెడ్డిపేటలో రోడ్ల వెంట తిరుగుతూ ఎవరైనా పెడితే తింటూ కాలం వెళ్లదీస్తున్నాడు. ఈక్రమంలో విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శేఖర్ తన సిబ్బందితో వెళ్లి మనోహర్‌ను చేరదీసి అతనికి క్షవరం చేయించి, నూతన దుస్తులను అందించి ఉదారతను చాటుకున్నారు. అనాథలకు ఏదో ఒకటి చేయాలని ఉద్దేశంతో మనోహర్‌ను చేరదీసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ పాషా, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు పంతులు, శ్రీకాంత్, ఆసిఫ్, రాజేందర్ ఉన్నారు.

రుద్రంగి: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబిద్ది ఉత్సవాల్లో భాగంగా రుద్రంగి మండల కేంద్రానికి చెందిన అనాథకు ప్రభాకర్ పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

‘ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య’

చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంలో ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీనారాయణ, బోయిన్‌పల్లి తిరుపతి ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. అంగన్‌వాడీ టీచర్లు అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ మెంగని శ్రీనివాస్, ఉపాధ్యాయులు కట్కూరి ముఖేశ్, కడారి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంటింటా తిరుగుతూ విద్యార్థులను సర్కారు పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. గోరింటాలలో జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, ఎంపీటీసీ అంజిరెడ్డి, సర్పంచ్ కొలుముల అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దేశాయిపేటలో అంగన్‌వాడీ బడిబాట

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం దేశాయిపేటలో మన ఊరు మన అంగన్‌వాడీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ పాల్గొన్నారు.

సిరిసిల్లఅర్బన్: పెద్దూరులోని ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు వుత్తం విజయ్‌కుమార్, వీణ, ప్రమీల, ఎస్ఎంసీ చైర్మన్ తమ్మిటీ జీవన్, అంగన్‌వాడీ టీచర్ సురేఖ తదితరులున్నారు.

ఇల్లంతకుంట: రహీంఖాన్‌పేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మన ఊరు– మన అంగన్‌వాడీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద లింగాపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ సింగం సూర్యకళ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు దర్శనాల స్వప్న, ఐలవ్వ, మంజుల తదితరులున్నారు.



బడిబాటలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల ప్రారంభించారు. మండల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరం ప్రతిమ ఫౌండేషన్ సహకారంతో రూ.6 కోట్లతో కార్పొరేట్ స్థాయిలో భవనాలు నిర్మించారన్నారు. ఎమ్మార్వో తఫాజుల్, ఎంపీడీవో నరేశ్ కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యబోధన అందిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు కుబేరా స్వామి అన్నారు. మండలకేంద్రంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోతుగల్, ఆవునూర్‌లో..

ముస్తాబాద్: పోతుగల్, ఆవునూర్ గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించి ప్రభుత్వ పథకాలు పొందాలని సూపర్‌వైజర్ అరవింద కోరారు.

నిమ్మపల్లిలో...

కోనరావుపేట: నిమ్మపల్లిలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ చిన్నారుల వివరాలను నమోదు చేసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ గూడూరి శారద, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల అర్బన్: ఒడిశా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాద మృతులకు బీజేపీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నివాళి అర్పించారు. అంబేడ్కర్ చౌక్ వద్ద కొవ్వత్తులు వెలిగించి, మౌనం పాటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆడెపు రవీందర్, నాగుల శ్రీనివాస్, సిరిస్వాల్ కైలాస్, గూడూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో..

బోయినపల్లి(చొప్పదండి): ఒడిషా రైలు ప్రమాద బాధితులకు శనివారం రాత్రి మండలకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో పలువురు ర్యాలీ నిర్వహించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహాచారి, బొటుకు తిరుపతి, గంగిపెల్లి స్వామి, చెన్నాడి రాజిరెడ్డి, అనిల్, యువకులు గంగిపెల్లి రాజశేఖర్ తదితరులున్నారు.

నేడు సురక్ష దివస్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దివస్ నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

- ఉదయం 9 గంటలనుంచి 10 గంటల వరకు పట్టణంలోని వాసవి గార్డెన్స్ నుంచి జిల్లాలోని పెట్రో కార్, బ్లూ కోల్ట్ వాహనాలతో, పోలీస్ బ్యాండ్, ట్రాఫిక్ సిబ్బంది, డిస్ట్రిక్ట్ గార్డ్ సిబ్బంది, పోలీస్ అధికారులు, సిబ్బందితో భారీ పోలీస్ ర్యాలీ నిర్వహించనున్నారు.



- ఉదయం 11:30 నుంచి 1గంట వరకు సిరిసిల్ల, వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్లలో మీ పోలీస్‌స్టేషన్ గురించి తెలుసుకొనుటలో భాగంగా ప్రజలకు పోలీస్‌స్టేషన్ పనితీరు, సిబ్బంది నిర్వహిస్తున్న విధులు పలు విషయాలపై అవగాహన కల్పిస్తారు.
- మధ్యాహ్నం 3:30 గంటల నుంచి 4:30 వరకు పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ప్రజలకు మహిళా భద్రత షీ టీమ్స్‌పై అవగాహన నిర్వహిస్తారు.
- సాయంత్రం 5:30 నుంచి 7:30 గంటల వరకు మినీ స్టేడియంలో పోలీస్ మేళా నిర్వహించి పాస్‌పోర్ట్ ఎంక్వయిరీ, డయల్ 100, పోలీస్ విధులకు సంబంధించి ఫొటో గ్యాలరీ, ఫ్రింగర్ ప్రింట్, కమ్యూనికేషన్, బాబ్ డిస్పోసల్ టీం, ఆయుధాల గ్యాలరీ, పోలీస్ శాఖలోని ఆధునిక శాస్త్ర సాంకేతక పరిజ్ఞానంపై మేళాలో తెలుపుతారు.

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సురక్ష దివస్‌ను నిర్వహిస్తున్నట్లు సీఐ వెంకటేశ్ తెలిపారు. పోలీస్‌స్టేషన్ గురించి తెలుసుకోండి అనే అంశంలో భాగంగా పోలీసుల ఆయుధాలు, ఎఫ్ఐఆర్, రిమాండ్, చార్జ్‌షీట్, కోర్టు ట్రయల్స్, షీటీమ్ సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4.30 గంటలకు సిరిసిల్ల మున్సిపల్ స్టేడియంలో పోలీస్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలి

- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

కోనరావుపేట(వేములవాడ): దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ కోరారు. మండలంలోని సుద్దాలలో జరిగిన రైతు దినోత్సవ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలన్నారు. పామాయిల్ పంటలు సాగు చేస్తున్న రైతులకు రాయితీపై మొక్కలు, డ్రిప్ పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. పామాయిల్ పంట సాగు చేస్తున్న రైతులకు సన్మానం చేశారు. మండలంలోని నిమ్మపల్లి, బావుసాయిపేట, నిజామాబాద్ గ్రామాల్లోని రైతు వేదికల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీపీ చంద్రయ్య సర్పంచులు దేవలక్ష్మి, సంతోష్, అనిల్, ఉపసర్పంచులు నాగరాజు, శ్రీనివాస్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ మహేశ్, ఎంపీడీవో రామకృష్ణ, ఏఈవో నరేశ్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఐక్య పోరాటాలు



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

బోయినపల్లి(చొప్పదండి): ఐక్య పోరాటాలతోనే రైతుల సమస్యలు తీరుతాయని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జాతీయ, రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో శనివారం భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు రాష్ట్ర అధ్యక్షుడు జోగినిపల్లి రంగారావు ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ, ధాన్యం సేకరించిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని పేర్కొన్నారు. మిల్లర్ల ఆగడాలను అరికట్టాలన్నారు. అఖిల భారత ప్రధానకార్యదర్శి మోహన్ మిశ్రా, కార్యదర్శి సాయిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు, రాష్ట్ర నాయకులు నానా ఆత్రే, మాదిరెడ్డి రాజిరెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల అధ్యక్షులు పులి లక్ష్మపతి, పోరెడ్డి సంజీవరెడ్డి, జోనల్ అధ్యక్షులు జోగినిపల్లి సంపత్‌రావు, బియ్యంకార్ శ్రీనివాస్, దూస రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బావుసాయిపేటలో రైతుల ఆందోళన



అధికారులతో రైతుల వాగ్వాదం

కోనరావుపేట(వేములవాడ): కొనుగోలు కేంద్రాలకు దొరకని లారీలు ఇసుక తరలించడానికి ఎలా వస్తున్నాయని రైతులు ఆందోళన చేశారు. మండలంలోని బావుసాయిపేటలో ఇసుక క్వారీకి ఇసుకను తరలించేందుకు శనివారం 24 లారీలు వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు క్వారీ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని తరలించడానికి లారీలు రాక ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రాలకు రాని లారీలు ఇసుకకు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. సమాచారం అందుకున్న ఎంవీఐ కొండల్‌రావు, మార్కెటింగ్ డీపీఎం పాపారావు, ఏపీఎం దేవరాజు ఘటన స్థలానికి చేరుకుని ఇసుకకు వచ్చిన లారీలను తనిఖీ చేశారు. లారీల ట్రిప్‌షీట్లను పరిశీలించారు. ప్రతీ లారీ ధాన్యం తరలించిన తర్వాతే ఇసుకకు రావాలని ఆదేశించారు. వారి వెంట సర్పంచ్ గంగాధర్, రైతులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి : తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతు ఉత్సవాల పేరుతో రాజకీయ ఉత్సవాలు చేస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతులకు ఏం చేశారని ప్రశ్నించారు. రూ.లక్ష రుణమాఫీ, పంటకు మద్దతు ధర, పంట నష్టం పరిహారం అందించలేదన్నారు. తాలు, తరుగు పేరుతో రైతులు మోసపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, గుగ్గిళ్ల శ్రీకాంత్, రాజు, భరత్, శ్రీనివాస్, తదితరలు పాల్గొన్నారు.

రైతులు ఆందోళనలు చేస్తుంటే సంబరాలా ?

చందుర్తి : నెలదాటినా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆందోళనలు చేస్తుంటే దశాబ్ది సంబరాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపటి రామస్వామి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోహిణి కార్తె ప్రవేశించి పదిరోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అలాగే ఉందన్నారు. ప్రజలను మభ్య పెట్టేందుకు సంబరాలు నిర్వహిస్తున్నారని, ప్రజలు మోసపోవద్దన్నారు. సమావేశంలో మర్రిగడ్డ సర్పంచ్ నేతికుంట జలపతి, పులి సత్తయ్య, దారం చంద్రం వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వం

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమాన్ని విస్మరించి తెలంగాణ ప్రభుత్వం సంబరాలు జరుపుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే. గౌస్ అన్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు పంట పరిహారం, రుణమాఫీ చేయడం లేదన్నారు. కాంగ్రెస్ వస్తేనే తెలంగాణలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందన్నారు. సమావేశంలో నాయకులు దేవయ్య, రాజునాయక్, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

హ్యాండ్‌రైటింగ్‌లో శిక్షణ అవసరం



చిన్నారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న శిక్షకులు

సిరిసిల్లటౌన్: చిన్నారులకు హ్యాండ్ రైటింగ్‌లో తర్ఫీదు అవసరమని సిరిసిల్లలోని ఇంగ్లిష్ యూనియన్ పాఠశాల కరెస్పాండెంట్ రాజ్‌కుమార్ అన్నారు. నలభై ఐదు రోజులుగా పాఠశాల ఆధ్వర్యంలో వివిధ తరగతులు అభ్యసిస్తున్న చిన్నారులకు చేతిరాతలో ప్రముఖ శిక్షకుడు శ్రీనివాస్ శిక్షణ అందించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

11న కవి సమ్మేళనం

సిరిసిల్ల కల్చరల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా ఈనెల 11న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అస్తిత్వం, ప్రగతి ప్రధాన వస్తువుగా రాసిన కవితలను 20 పంక్తులకు మించకుండా 99089 22301 సెల్ నెంబర్‌కు వాట్సప్ ద్వారా ఈనెల 7 లోపు పంపించాలన్నారు. జిల్లాకు చెందిన కవులు మాత్రమే ఇందులో పాల్గొనేందుకు అర్హులన్నారు. తెలుగు, ఉర్దూ భాషల్లో కవితలు రాయవచ్చన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగే కవి సమ్మేళనానికి ఉదయం 10 గంటలలోపు హాజరు కావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: ప్రముఖ కార్పొరేట్ ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కులాల అభివృద్ధి అధికారి బి.వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ప్రభుత్వ రంగ సంస్థల్లో పదో తరగతి చదివి కనీసం 7.0పైన జీపీఏ సాధించి ఉండాలన్నారు. ఈ పాస్ వెబ్‌సైట్‌లో ఈ నెల 11లోపు ఆసక్తి గల విద్యార్థులు తమ వివరాలను పొందుపర్చాలన్నారు. కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, స్టడీ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను అందించాలన్నారు.

డిగ్రీ కళాశాలలో చేరండి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఇంటింటికి వెళ్లి విద్యార్థులను చేర్పుకుంటున్నారు. కళాశాలలో ఉన్న వసతులు వివరిస్తూ ప్రవేశాలు తీసుకునేలా చేస్తున్నారు.